క్లుప్తంగా

పాఠశాల విద్యలో క్లస్టర్ విధానం



క్లస్టర్ విధానంపై సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): పాఠశాల విద్యాశాఖలో కీలకమైన స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో క్లస్టర్ల పునర్నిర్మాణంపై స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు డివిజన్ 11 మండలాలకు చెందిన ఆయా పాఠశాలల్లో ఎంఈఓలు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, హెచ్ఎంలు పాల్గొని స్కూల్ మోనిటరింగ్ కమిటీలో తీసుకున్న తీర్మానాలను వివరించారు. జీఓ 117 రద్దు నేపథ్యంలో పాఠశాలలను శాటిలైట్ స్కూల్స్, ఫౌండేషనల్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరి, హై స్కూల్స్‌గా మార్పులకు సంబంధించి పాఠశాల వారీగా తీసుకున్న అభ్యంతరాలు, అంగీకారాలపై కలెక్టర్ ఆరా తీశారు. డీఈఓ వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్‌గా రమణారావు

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్‌గా జేవీ రమణారావు నియమితులయ్యారు. ఆయనకు మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ నియామక పత్రం అందజేశారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ కె.భీమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ విద్యార్థినులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులు


ఏలూరు (ఆర్ఆర్‌పేట): తమ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ జి.సరళ తెలిపారు. మంగళవారం స్థానిక సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 539 మంది హాజరవ్వగా, 127 మంది ఎంపికయ్యారని సరళ తెలిపారు. మహిళా కళాశాల విద్యార్థినులు స్పీకింగ్ ట్రీ కంపెనీకి 28 మంది, పానసోనిక్‌కి 27 మంది, ఇసుజుకి 20 మంది ఎంపికయ్యారని వివరించారు. వీరిని కళాశాల కరెస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు (నానాజీ)అభినందించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ జీఎస్ఆర్ కల్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చీడపీడలను తట్టుకునే ఎంటీయూ 1426 వరి

భీమడోలు: దాళ్వాలో చీడపీడలను తట్టుకుని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే వరి విత్తనం ఎంటీయూ 1426 అని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ మార్టేరు అధిపతి, సహాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాసు అన్నారు. పూళ్లలో ఆదర్శ రైతు వి.రాజేంద్రప్రసాద్ సాగు చేసిన ఎంటీయూ 1426 వరి క్షేత్రాన్ని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల బృందంతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులకు ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఎంటీయూ 1426 వరి మొక్క దుబ్బుకు 33 పిలకలు, కంకి పొడవు, గింజలకు సైతం ఎక్కువగా ఉండడంతో ఎకరాకు 55 నుంచి 60 బస్తాల దిగుబడి వస్తుందని రైతు తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త టి.శ్రీనివాసు, ఎరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.ఫణికుమార్, శాస్త్రవేత్త అప్పారావు, ఏడీఏ పి.ఉషారాజకుమారిలు వ్యవసాయంలో మెలకువలను వివరించారు. రైతుల అనుమానాలను వారి నివృత్తి చేశారు. కార్యక్రమంలో మార్టేరు విద్యార్థులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా కాల్వ గట్టుకు ముప్పు

- భారీ వాహనాల పార్కింగ్
- మరమ్మతులు, కడగడాలు అక్కడే
- రామకృష్ణాపురం నుంచి పోస్టల్ కాలనీ వరకు సమస్య



మినీ బైపాస్ రోడ్డులో నిలిపిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మినీ బైపాస్ రోడ్డులో రామకృష్ణాపురం నుంచి పోస్టల్ కాలనీ చివరి వరకు కృష్ణా కాలువ గట్టుపై లారీలు, టూరిస్ట్ బస్సులు, ఇతర భారీ వాహనాల పార్కింగ్ స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. మినీ బైపాస్ రోడ్డుపై విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వైపుకు, విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వైపుకు వెళ్లే ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో పాటు నగరానికి వివిధ వస్తువులు తీసుకొచ్చే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రామకృష్ణాపరం, పోస్టల్ కాలనీ, గ్రీన్ సిటీ, సత్రంపాడులోని కొంత భాగం నుంచి ప్రజలు రాకపోకలు సాగించడానికి ఈ రహదారినే వినియోగిస్తుంటారు.

చిత్తడిగా కాల్వ గట్టు

కాల్వకు ఓ వైపు మినీ బైపాస్ రోడ్డు, మరో వైపు నివేశన గృహాలు, వివిధ దుకాణాలు, షోరూములు ఉన్నాయి. భారీ వాహనాల నిలుపుదలతో గట్టు జా రి పోయి మినీ బైపాస్ రోడ్డు కుంగిపోయే ప్రమా దం ఏర్పడింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఈ గట్టుపైనే నిలిపి కాల్వ నీటితో కడుగుతుంటారు. దీంతో గట్టు చిత్తడిగా మారి మెత్తబడి కాల్వలోకి జారిపోతోంది. కొన్ని వాహనాలకు ఇక్కడే మరమ్మతులు చేస్తుంటారు.

నీటి ప్రవాహానికి ఆటంకం

రామకృష్ణాపురం ప్రాంతం నుంచి ప్రారంభమై పోస్టల్ కాలనీ చివరి వరకు మొత్తం కాల్వ గట్టుపైనే వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, చిన్నకార్లు, 10 టైర్లు, 12 టైర్ల లారీలు ఇలా గట్టుపై పార్కింగ్ చేసి ఉంటాయి. వేసవిలోనే కాదు వర్షాకాలంలోనూ ఇదే పరిస్థితి. దీంతో గట్టు జారిపోవడంతో పాటు కాలువ వెడల్పు తగ్గడం, జారిన మట్టితో కాలువ పూడుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని స్థానికులు చెబుతున్నారు.



పోస్టల్ కాలనీ వద్ద కాలువ గట్టుపై నిలిపిన భారీ లారీలు



కాలువ గట్టు వెంబడి వరుసగా నిలిపిన చిన్నకార్లు

ప్రమాదాలకు అవకాశం

రోడ్డుకు ఒక వైపుగా కాల్వ గట్టుపై భారీ వాహనాల నిలుపుదలతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. కలపర్రు టోల్ గేట్ నుంచి ఏలూరు ఆశ్రం కళాశాల మధ్యలో ఇటీవల మెయిన్ బైపాస్‌లో ఇలా రోడ్లపై వాహనాలు నిలిపిన కారణంగానే గత పది రోజుల్లో నాలుగు భారీ ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో ప్రాణ నష్టం సంభవించింది. అంతటి భారీ ప్రమాదాలు సంభవించక ముందే వాహనాల పార్కింగ్ నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు



మినీ బైపాస్ రోడ్డులో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, భారీ లారీల నిలుపుదల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. అప్పుడప్పుడూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలు దెబ్బతింటున్నాయి. చోదకులు గాయాలపాలవుతున్నారు. కాల్వ గట్టు కుంగిపోతోంది. ప్రాణ నష్టం సంభవించక ముందే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– బేతపూడి కిరణ్ కుమార్, స్థానికుడు

స్పందించని కమిషనర్



మినీ బైపాస్ రోడ్డులో వాహనాల ప్రమాదకర పార్కింగ్‌పై నగర కమిషనర్, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేశాం. కలెక్టర్ కార్యాలయం నుంచి కమిషనర్‌కు ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశాలు అందాయి. ఇది జరిగి నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోలేదు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– రామనపూడి శివప్రసాద్, హిందూ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

డిగ్రీ కళాశాలలో ఆడిట్ పూర్తి



అకడమిక్ అడ్వైజర్ రవిని సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం 2023 – 24, 2024 – 25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన అకాడమిక్ ఆడిట్ నిర్వహించారు. అధ్యాపకులు ఎస్ లక్ష్మీకాంతం (భీమవరం), కె.రవి (నారాయణపురం) అకడమిక్ అడ్వైజర్లుగా హాజరై వివిధ విభాగాల అధ్యాపకుల అకాడమిక్ యాక్టివిటీస్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ అకడమిక్ ఆడిట్ అధ్యాపకుల విద్యా సంబంధ కార్యక్రమాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై, ప్రిన్సిపాల్

భీమడోలు: ఆన్‌లైన్ మోసాల ఉచ్చులో పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై వై.సుధాకర్ సూచించారు. స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షతన శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఎస్సై సుధాకర్ శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మహిళలు, బాలికల రక్షణకు ఈ యాప్ పని చేస్తుందన్నారు. టీం సభ్యుల విధి విధానాలపై అవగాహన కల్పించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానాలు విధిస్తామన్నారు. తొలుత శక్తి యాప్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై చలపతిరావు, సభ్యులు రత్నమాణిక, మహిళా కానిస్టేబుల్స్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో రాణించాలి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): అధ్యాపకుల సహకారంతో పరిశోధన రంగంలో ముందుకు సాగాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్ అన్నారు. మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఫైనల్ ఇయర్ ఇంటర్న్‌షిప్ ముగింపు సందర్భంగా డిగ్రీ పట్టాల ప్రదానోత్సవం చేశారు. కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థినులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలని సూచించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ తమ కళాశాలలో చదువు పూర్తి చేయబోతున్న సుమారు 100 మంది విద్యార్థినులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. అనంతరం అనేక రంగాల్లో ప్రతిభా వంతులైన, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మరియ క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సునీల, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ ఫాతిమా డిగాల్, వివిధ విభాగాల అధ్యాపకులు, మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్ విభాగాధిపతి గోపినాథ్, అధ్యాపకులు శ్రావణి, పి.పూజిత, దుర్గా దేవి, జి.జ్యోతి, ఎస్ జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుధాకర్

41 పరిశ్రమలకు అనుమతులు

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలో 41 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో పథకం ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం ఏర్పాటుచేసిన జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ, జిల్లా పారిశ్రానుమిక భద్రతా కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పరిశ్రమల అభివృద్ధి పాలసీని అనుసరించి 13 పరిశ్రమలకు రూ.1.68 కోట్ల ప్రోత్సాహకాలుగా మంజూరు చేశామన్నారు. వివిధ పరిశ్రమల ఉత్పత్తులకు ఆన్‌లైన్స్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ మరింత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కేసులు నమోదు చేయండి

భద్రతా నిబంధనలను పాటించని పరిశ్రమలపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమాలన్నింటిలోనూ భద్రతా పరమైన అంశాలను పరిశీలించి, నిబంధనలు పాటించని పరిశ్రమల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీచేసి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ ఆర్ విజయరాజు, హార్టికల్చర్ డీడీ రామ్మోహన్, ఎల్‌డీఎం నీలాద్రి, కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు (టూటౌన్): పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం కలెక్టర్‌ని సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు ఆధ్వర్యంలో పలువురు మహిళలు కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాన్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా 100 మంది మహిళలకు ఉచితంగా జూట్ బ్యాగ్స్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. వరప్రసాదరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు తమ వంతు కృషి చేస్తున్నట్టు చెప్పారు. దీనికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులు జూట్ ఉత్పత్తులు, పేపర్, క్లాత్ బ్యాగులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల తయారీ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పెరికె దీన గ్లాడి, సింధూర గ్రూప్ ప్రతినిధి పోతురాజు మేరీ తనూజ, డాక్టర్ ఫ్లోరా జోన్స్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు జూట్ బ్యాగ్ అందిస్తున్న వరప్రసాదరావు, మహిళలు

పాఠశాలలో సౌకర్యాలపై ఆరా

పెదపాడు : మండలంలోని వట్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యాబోధనపై ఆరా తీశారు. పిల్లలతో కలిసి వారి పాఠ్య పుస్తకాలును పరిశీలించారు. అందులోని అంశాలను బాలబాలికలతో చదివించారు. వారు చెప్పిన సమాధానాలకు కలెక్టరు అభినందించారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. మొత్తం 27 మందిలో 18 మంది పాఠశాలకు హాజరయినట్లు గుర్తించారు. కొంతకాలంగా హాజరు కాని విద్యార్థి హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు వి.సావిత్రి, ఉపాధ్యాయుడు రంగమోహన్‌లను మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. వీరి వెంట ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఎంపీడీఓ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతన్న ఎంపీపీ శ్రీలక్ష్మి



హాజరైన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు

ఎంపీపీ శ్రీలక్ష్మి

ఉంగుటూరు: గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన ఉంగుటూరు మండల పరిషత్ సమావేశానికి శ్రీలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. మండల నిధులతో కాకర్లమూడి, గోపీనాథపట్నం, దొంతవరం, రాచూరు, ఉప్పాకపాడు, వీపీ పురం గ్రామాల్లో మంచినీటి సరఫరా మెరుగునకు కృషి చేస్తామన్నారు. మండలంలో నాలుగు గ్రామాల్లో తప్ప మిగిలిన గ్రామాల్లో రోడ్ల పనులు పూర్తయినట్టు తెలిపారు. ఎంపీడీఓ రాజ్‌మనోజ్ మాట్లాడుతూ పి–4 సర్వే పూర్తి కావొచ్చిందన్నారు. చెరువుల్లో నీరు నింపుకోవాలని పంచాయతీలకు సూచించారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం రూ.8 లక్షలు మంజూరయినట్టు చెప్పారు. ఏప్రిల్ మెదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఏఓ ప్రవీణకుమార్ తెలిపారు. త్వరలో రేషన్ కొత్త కార్డులు ఇవ్వనున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు వివరించారు. ఉపాధి పనులు 15.63 లక్షల పనిదినాలకు 11.75 లక్షల పనిదినాలు పూర్తి చేశామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఖాజావలీ తెలిపారు.

ఉపాధి కల్పించాలి

ఎ.గోకవరంలో ఎస్సీలకు ఉపాధి కల్పించాలని సర్పంచ్ మిద్దే సత్యవతి కోరడంతో చర్యలు తీసుకుంటామని ఏపీఓ సమాదానమిచ్చారు. మండలంలో 40 సీపీ రోడ్లకు ఏడు నిర్మాణాలు పూర్తిచేశామని పీఆర్ఏఈ కృష్ణమోహన్ తెలిపారు. వీపీ పురం పంచాయతీ భవన నిర్మాణం పూర్తికి నిధులు మంజూరుచేయాలని సర్పంచ్ ఎస్ లక్ష్మి ధర్మారావు కోరారు. 2019కి ముందు ఇళ్ల నిర్మించుకున్న వారికి నిధులు మంజూరయ్యాయని హౌసింగ్ ఏఈ సతీష్ తెలిపారు. వెలుగు ద్వారా నిర్వహించే కార్యక్రమలను గతంలో వలే క్షేత్ర స్థాయిలో తెలియజేయాలని నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకానంద కోరారు. డ్వాక్రా మహిళల వ్యాపారాలకు గుర్తింపు ఇవ్వడంలేదని చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మీ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాకింగ్ ఉంటేనే గుర్తింపు ఉంటుందని ఏపీఎం ప్రభావతి జవాబిచ్చారు. ఏఈ వేణు, పశుగణాంక అధికారి మల్లెపూడి బాబూరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు తదితరులు మాట్లాడారు. తొలుత ఇటీవల మృతి చెందిన కాకర్లమూడి సర్పంచ్ కాళ్ల నాగుకు సంతాపం వ్యక్తం చేశారు. ఉంగుటూరు ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి సహకరిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారని విలేకర్లు తెలిపారు. కాకర్లమూడి సర్పంచ్ వెంకట్రావు, నాచుగుంట సర్పంచి సునీత, ఎంపీటీసీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగం పెంచాలి

ఏలూరు (మెట్రో): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సమావేశామని ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అట్రాసిటీ కేసుల్లో భాధితులకు సత్వర న్యాయం చేసేందుకు నిర్దేశించిన సమయంలోపే చార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించారు. చార్జిషీటు దాఖలు చేయని ఏ ఒక్క కేసూ పెండింగ్‌లో ఉండకూడదన్నారు. గిరిజన ప్రాంత పాఠశాలల్లో విద్యార్థులకు ఆట సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం పటిష్టంగా పనిచేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని పలువురు కమిటీ సభ్యులు తెలిపారు. గిరిజన ప్రాంత రోడ్ల పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 41 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, రూ.25.50 లక్షల పరిహారం మంజూరు చేశామని, మరో రూ.13.25 లక్షలు పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కమిటీ సభ్యులు జి.మోహన్‌రావు, టి.రాజేష్‌బాబు, ఎల్ ప్రవల్లిక, మట్టారాజు, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, అడిషనల్ ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఐటీడీఏ పీఓ కె.రాములునాయక్, డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ శిబిరాలు

భీమడోలు: మండల పరిధిలో ఈనెల 19 నుంచి 22 వరకు సచివాలయాల్లో ఆధార్ మొబైల్ శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి మంగళవారం తెలిపారు. ఆధార్ నమోదు, మార్పులు చేయించుకోవచ్చన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

భీమడోలు: బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి మంగళవారం తెలిపారు. వ్యవసాయం, వాటి అనుబంధం రవాణా, పరిశ్రమలు, సేవ, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి పథకాలు, ఎంఎస్ఎంఈ కింద జనరిక్ ఫార్మసీల రుణాలు పొందేందుకు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ అర్హత గల బీసీ అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. బీసీ కుల ధ్రువీకరణ పత్రం, వయోపరిమితి 21 నుంచి 60 ఏళ్ల వరకు, బీపీఎల్ పరిధిలో ఉండాలని, డ్రైవింగ్ లైసెన్సులు, రేషన్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కూడిన దరఖాస్తులను సచివాలయాల్లో ఈనెల 22లోగా అందజేయాలని వివరించారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు : మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా అన్నదానం చేశారు. ఆలయం వద్ద ఉన్న యనమదల రామస్వామి సత్రంలో పూజలు నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌లోని ధనలక్ష్మి మెడికల్ షాపు యజమాన్యం ఆర్థిక సాయంతో 200 మందికి అన్నదానం చేశారు.

విద్యుత్ కెపాసిటర్ల దొంగ అరెస్ట్

భీమడోలు: అంబర్‌పేట ఆక్వా చెర్వులోని విద్యుత్ త్రీఫేజ్ కెపాసిటర్లు దొంగించిన వ్యక్తిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామంలోని రొయ్యల రైతు సుధీర్‌కుమార్ తన చెర్వుపై షెడ్ నిర్మించుకుని అందులోని విద్యుత్ కెపాసిటర్లు భద్రపర్చాడు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన తమ్మిశెట్టి గోపి అనే వ్యక్తి షెడ్డు తాళాలు పగలకొట్టి ఎలక్ట్రికల్ కెపాసిటర్లను అపహరించుకుని పరారయ్యాడు. నిందితుడ్ని పట్టుకుని భీమడోలు కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	26
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	20.15	4802	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – తిరుపతి	16.00	4830	32